క్లుప్తంగా

కమనీయం.. వెంకటేశ్వరుని కల్యాణం



నెల్లూరు(బృందావనం) : బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం శనివారం కమనీయంగా సాగింది. సకల జనులకు శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థిస్తూ కల్యాణాన్ని నిర్వహించినట్లు మందిర నిర్వాహకులు తెలిపారు. ఉభయకర్తగా పుండరీకాక్షం వ్యవహరించారు. కార్యక్రమాలను మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు మస్తాన్‌రావు, సోమిశెట్టి వెంకటరత్నం , కోశాధికారి కొప్పరపు శివప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

ఐటీఐలో బ్రిడ్జి కోర్సు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ ఐటీఐల్లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం వెంకటేశ్వరపురంలోని ఐటీఐలో ఈనెల 21 వరకు బ్రిడ్జి కోర్సును నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సులో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ప్రవేశ పరీక్షకు అర్హులన్నారు.

రిటైర్డ్ వైద్య ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



నెల్లూరు(అర్బన్) : స్థానిక సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏపీ మెడికల్ అండ్ హెల్త్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2025 క్యాలెండర్లను డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా సెక్రటరీ కల్పం శ్రీనివాసులు మాట్లాడుతూ మెడికల్ రీయింబర్స్‌మెంట్, వైద్య విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో డీఎంహెచ్‌ఓ అండగా ఉండాలని కోరారు. అనంతరం డీఎంహెచ్‌ఓ సుజాత మాట్లాడుతూ వైద్యశాఖలో తొలి ప్రాధాన్యత వృద్ధాప్యంలో ఉన్న విశ్రాంత ఉద్యోగులకే కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్, సంఘ వ్యవస్థాపకుడు అరికొండ హరిబాబు, జిల్లా అధ్యక్ష, గౌరవాధ్యక్షులు డాక్టర్ వీరప్రతాప్, విద్యాసాగర్, సెక్రటరీ కల్పం శ్రీనివాసులు, న్యాయ సలహాదారు శేషగిరిరావు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.


తొలిరోజు 171 రిజిస్ట్రేషన్‌లు

నెల్లూరు సిటీ : ల్యాండ్ రిజిస్ట్రేషన్ ధరల పెంపు నేపథ్యంలో శనివారం నుంచి నూతన విధానం అమలులోకి వచ్చింది. దీంతో తొలిరోజు 171 రిజిస్ట్రేషన్‌లు మాత్రమే జరిగాయి. అయితే పాత విధానం శుక్రవారం ముగియడంతో చివరిరోజు ఎన్నడూ లేనన్ని రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ఒక్కరోజు జిల్లాలోని 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 758 రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. ప్రభుత్వానికి రూ.5.69 కోట్ల ఆదాయం వచ్చింది.

పరిశ్రమల సహకారం అవసరం

వెంకటాచలం : కొత్త ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధి కోసం పరిశ్రమలు, విద్యాసంస్థల పరస్పర సహకారం అవసరమని విక్రమసింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు అన్నారు. కాకుటూరు వద్దనున్న వీఎస్‌యూలో 'ఇండస్ట్రీస్‌- ఇన్‌స్టిట్యూట్' సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ పరిశీలనాత్మక నైపుణ్యాలు, వాస్తవ సమస్యలపై పరిశోధన చేయడం, పరిశ్రమ అవసరాలకనుగుణంగా పాఠ్య పుస్తకాలను రూపకల్పన చేయడం ద్వారా విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు సిద్ధం చేయడం వంటి అంశాలు ముఖ్యమైనవన్నారు. అలాగే పరిశ్రమల ప్రతినిధులు బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యులుగా, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా చేరాలని, తద్వారా పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య నైపుణ్యాల లోటును తీర్చేలా సహకరించాలన్నారు. సమావేశంలో పలు పరిశ్రమల ప్రతినిధులు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

వేడుకగా మహాకుంభాభిషేకం



ఇందుకూరుపేట: గంగపట్నంలోని చాముండేశ్వరిదేవి ఆలయంలో పుష్కర మహాకుంభాభిషేకాన్ని వేడుకగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు చేశారు. కాగా యంత్ర స్థాపన, చాముండేశ్వరీదేవి అమ్మవారు, పరివార దేవతల మహాకుంభాభిషేకాన్ని ఆదివారం నిర్వహించనున్నామని ఈఓ తాతా శ్రీనివాసరావు తెలిపారు.

పరవశించిన సింహపురి

హరేరామ హరేకృష్ణ రామరామ హరే హరే.. నామ స్మరణలతో నగరం మార్మోగింది. శ్రీకృష్ణబలరామ సుభద్రలు ప్రత్యేక పుష్పాలంకరణలతో తీర్చిదిద్దిన రథంపై శనివారం కొలువై భక్తులను కటాక్షించారు. ఇస్కాన్ నెల్లూరు శాఖ అధ్యక్షుడు డాక్టర్ శుకదేవస్వామి పర్యవేక్షణలో నగరంలో చేపట్టిన 12వ రథయాత్ర ఆద్యంతం వేడుకగా జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని ఇస్కాన్ మందిరాల నుంచి విచ్చేసిన నిర్వాహకులతో పాటు భక్తబృందం సంయుక్తంగా చేపట్టిన రథయాత్రతో సింహపురి పరవశించింది.

– నెల్లూరు(బృందావనం)





హారతులు ఇస్తున్న భక్తులు



ప్రత్యేక రథంపై కొలువైన స్వామి, అమ్మవార్లు



కోలాటం ఆడుతున్న మహిళలు



విశేషంగా తరలివచ్చిన భక్తజనం

52వ డివిజన్ ఇన్‌చార్జిగా మహబూబ్‌బాషా



మహబూబ్‌బాషాను అభినందిస్తున్న ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు) : నగరంలోని 52వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా మహబూబ్‌బాషాను ఎంపిక చేసినట్లు ఎమ్మెల్సీ, పార్టీ సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ప్రకటించారు. నగరంలోని రామ్‌జీనగర్‌లో ఉన్న సిటీ కార్యాలయంలో 52వ డివిజన్‌కు చెందిన దాదాపు 200 మంది పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి అభిప్రాయాల మేరకు మహబూబ్‌బాషాను డివిజన్ ఇన్‌చార్జిగా నియమించారు. కష్టపడి పనిచేసే స్వభావం ఉన్న వ్యక్తి మహబూబ్‌బాషా అని, పార్టీ కార్యక్రమాలను డివిజన్‌లో గడప గడపకు తీసుకెళ్లి ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. డివిజన్‌లో మిగిలిన నాయకులకు కూడా జిల్లా, రాష్ట్రస్థాయి కమిటీల్లో ప్రాధాన్యం కల్పిస్తామన్నారు. పార్టీ నాయకులు రమేష్, శ్రీనివాసులు, జలీల్, మునాబాయ్, ఫయాజ్, నూర్, హరున్, బీవీకే యాదవ్‌తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

మానవత్వంతో స్పందించాలి

• డీఎంహెచ్‌ఓ సుజాత



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ, అధికారులు

నెల్లూరు(అర్బన్) : ప్రమాదాలు జరిగినప్పుడు మానవత్వంతో స్పందించి క్షతగాత్రులను 108 వాహనం ద్వారా సమీపంలోని ఆస్పత్రికి తరలించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాత అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని రవాణాశాఖ ఆధ్వర్యంలో నగరంలోని నారాయణ ఆస్పత్రిలో రహదారి భద్రతపై శనివారం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రమాదానికి గురైన వ్యక్తిని మొదటి గంటలోపు ఆస్పత్రిలో చేర్చితే ప్రాణాలను రక్షించవచ్చన్నారు. ప్రమాద స్థలం నుంచి ఆస్పత్రికి చేర్చిన వారిని ప్రస్తుత చట్టాల ప్రకారం పోలీసులు ఎలాంటి ఇబ్బందులు పెట్టరన్నారు. ఆస్పత్రి వద్ద వేచి ఉండాల్సిన అవసరం కూడా లేదన్నారు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఘువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ గాయపడిన వారికి సహాయం చేసిన వ్యక్తులు ఆస్పత్రిలో ఎలాంటి ధ్రువపత్రాలు చూపాల్సిన అవసరం లేదన్నారు. పోలీసులకు సివిల్, క్రిమినల్ సంబంధిత వివరణలు ఇవ్వాల్సిన పని లేదన్నారు. అందువల్ల ప్రతిఒక్కరూ ప్రమాదాల్లో గాయపడిన వారికి సాయపడాలన్నారు. అతివేగం ప్రమాదకరమని, హెల్మెట్ ప్రయాణం మంచిదన్నారు. కార్యక్రమంలో నారాయణ ఆస్పత్రి డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కాంత్, డా.గోపాలకృష్ణ, రోడ్‌సేఫ్టీ వెహికల్ ఆఫీసర్ పూర్ణచంద్రరావు, నారాయణ ఆస్పత్రి ఏజీఎం ఎ.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్) : అడిగినంత డబ్బు ఇవ్వకుంటే మీ ఆస్పత్రిపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తానని వైద్యుడిని ఓ వ్యక్తి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో ఆయన ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... నగరానికి చెందిన డాక్టర్ పవన్‌కుమార్ వెంకటరామపురంలో హాస్పిటల్ నిర్వహిస్తున్నారు. తాను అడిగినంత డబ్బులు ఇవ్వకుంటే ఆస్పత్రిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తానని ముత్తుకూరు మండలం మామిడిపూడికి చెందిన కిరణ్ గత కొంతకాలంగా బెదిరిస్తున్నారు. గతనెల 31న హాస్పిటల్ నుంచి ఇంటికి వెళ్తున్న డాక్టర్‌ను బాలాజీనగర్‌లో కిరణ్ అడ్డుకుని నగదు ఇవ్వాలని బెదిరించాడు. ఈ మేరకు బాధితుడు శనివారం బాలాజీనగర్ పోలీసులకు పిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

న్యాయం చేయాలని వినతి



నెల్లూరురూరల్ : మా ఇంటి మీద దాడి చేసి ఆక్రమించుకోవాలని చూసిన కిరాయి రౌడీలను వేదాయపాళెం పోలీసులకు పట్టిస్తే వదిలేశారని, తమకు న్యాయం చేయాలని శనివారం డీఆర్వో ఉదయభాస్కర్‌రావుకు కావేరినగర్‌కు చెందిన మిడతల వైష్ణవి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొందరు నకిలీ పత్రాలు సృష్టించి ఇంటిని ఆక్రమించాలని చూస్తున్నారని, మూడు నెలల నుంచి తిరుగుతున్నా పట్టించుకోవడం లేదన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



నెల్లూరు సిటీ : నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఈనెల 4న రథ సప్తమి, 8న భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని కార్యక్రమ పోస్టర్లను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఆలయ ఈఓ వేమూరి గోపి, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

8న ప్రయాగ్‌రాజ్‌కు ఆర్టీసీ బస్సు

నెల్లూరు సిటీ : ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళాకు నెల్లూరు నుంచి ఈనెల 8వ తేదీన ఆర్టీసీ బస్సు బయలుదేరుతుందని డిపో–1 మేనేజర్ మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8న మధ్యాహ్నం 2 గంటలకు నెల్లూరు నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరుతుందన్నారు. రెండో రోజు సాయంత్రం ప్రయాగ్‌రాజ్ చేరుతుందని, మూడోరోజు ప్రయాగ్‌రాజ్‌లో బస, నాలుగోరోజు అక్కడి నుంచి బయలుదేరుతుందన్నారు. ఇలా మార్గం మధ్యలో ఐదోరోజు అయోధ్యలో బలరాముని దర్శనం, ఆరో రోజు వారణాసి సందర్శన చేసి ఎనిమిదో రోజు (15న) రాత్రి నెల్లూరుకు చేరుతుందన్నారు. చార్జీ రూ.9 వేలుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

కానిస్టేబుల్ విధుల్లో ట్రెయినీ డీఎస్పీ

నెల్లూరు(క్రైమ్) : ట్రెయినీ డీఎస్పీ ఎ.శివప్రియ శిక్షణలో భాగంగా శనివారం నవాబుపేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ విధులు చేపట్టారు. జగన్నాథ రథయాత్ర బందోబస్తు విధులు నిర్వర్తించారు. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన శివప్రియ 2024 బ్యాచ్ డీఎస్పీ. ఆమె అనంతపురం పీటీసీలో శిక్షణ పూర్తి చేసుకుని ప్రాక్టికల్ ట్రెనింగ్ నిమిత్తం జిల్లాకు కేటాయించారు. ఆమె ఈ ఏడాది జూలై 25వ తేదీ వరకు జిల్లాలో కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ విధుల వరకు శిక్షణ పొందనున్నారు. ఇలా నవాబుపేటలో వారం రోజుల పాటు కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తారు. వృత్తిపరమైన వివిధ అంశాలను ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా ఆమెకు వివరించారు.

సమాజ ధర్మమే సనాతనం



మాట్లాడుతున్న విమర్శకుడు తెలకపల్లి రవి

నెల్లూరు(బృందావనం) : సమాజంలో ప్రజలు పాటించిన ధర్మమే అసలైన సనాతన ధర్మమని మాజీ ఎమ్మెల్సీ ఎమ్వీఎస్ శర్మ అన్నారు. నగరంలోని వీఆర్సీ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న సింహపురి పుస్తక మహోత్సవంలో ఐదో రోజు ఆరుద్ర సాహిత్య వేదికపై 'ఏది సనాతన ధర్మం?', 'సనాతన ధర్మం అంటే ఏమిటీ?' అనే పుస్తకాలను విమర్శకుడు, సాహితీవేత్త తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ ఎమ్వీఎస్ శర్మ ఆవిష్కరించారు. దీనిని విశ్రాంత ప్రిన్సిపల్, చరిత్ర పరిశోధకుడు డాక్టర్ కాళిదాసు పురుషోత్తం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతంతో ముడిపడిన రాజకీయాలు నేడు దేశంలో నడుస్తున్నాయని, దీనివల్ల దేశ ఐక్యతకు భంగం కలుగుతుందన్నారు. మతంపేరిట మనువాద ధర్మాన్ని ముందుకు తెచ్చి కులాల పేరుతో చీలికలు పెంచే దుర్మార్గాన్ని నేడు సనాతన ధర్మంగా ప్రచారం చేస్తున్నారన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ కన్వీనర్ కె.లక్ష్మయ్య పాల్గొన్నారు.

సగానికిపైగా ఫెయిల్

నెల్లూరు (టౌన్) : డ్రైవింగ్ లైసెన్స్ కోసం వెళ్లిన వాహనదారులు గడ్డు పరిస్థిని ఎదుర్కొంటున్నారు. నగరంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ ద్వారా శనివారం నుంచి రవాణాశాఖ అధికారులు లైసెన్సులు జారీ చేస్తున్నారు. తొలిరోజు 53 మంది డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 24 మందే ఉత్తీర్ణులయ్యారు. 29 మంది ఫెయిల్ అయ్యారు. వీరు డ్రైవింగ్ లైసెన్స్ కోసం మళ్లీ కొత్తగా స్లాట్‌బుక్ చేసుకోవాల్సి ఉంది. డ్రైవింగ్ బాగా వచ్చిన వారు మాత్రమే ఉత్తీర్ణత సాధిస్తున్నారని అధికారులు చెబుతున్నారు. లైసెన్స్ కోసం అరకొర డ్రైవింగ్ నేర్చుకుని వెళ్తే ఫెయిల్ కాక తప్పదంటున్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి



మాట్లాడుతున్న మరియన్న

నెల్లూరు(బారకాసు) : రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ పరిధిలో తాగునీటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఇంజినీర్ ఇన్ చీఫ్ మరియన్న సూచించారు. ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఇంజినీర్లతో నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులు, తాగునీటి పైప్‌లైన్లు, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు తదితర నీటి సరఫరాకు సంబంధించిన వాటిని పరిశీలించి అవసరమైన చోట్ల మరమ్మతులు చేయించాలని సూచించారు. రోడ్లపై ఏర్పడిన గుంతలను గుర్తించి అన్నిచోట్ల ప్యాచ్‌వర్క్ పనులను పూర్తి చేయాలని, అవసరమైన చోట్ల సీసీరోడ్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అమృత్ పథకం అమలు తీరును అందరూ పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. సమావేశంలో పబ్లిక్ హెల్త్ సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా రాణించాలి



మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి



వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కోళ్ల పెంపకందారులు

• కోళ్ల పెంపకంపై అవగాహన సదస్సు

నెల్లూరు(బృందావనం) : చిరుద్యోగులు, యువత కోళ్ల ఫారాలను స్థాపించి ఆర్థికంగా రాణించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కె.రమేష్‌నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.జయచంద్రారెడ్డి ఆకాంక్షించారు. పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సెంటర్ ఫర్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (సీఈడీ) డైరెక్టర్ బి.వెంకట్ ఆధ్వర్యంలో నాటు, బాయిలర్ కోళ్ల పెంపకంపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కోళ్ల పెంపకం , ప్రస్తుత పరిస్థితి, కోళ్ల పెంపకానికి తీసుకోవాల్సిన చర్యలు, కోళ్లకు వచ్చే వ్యాధులు, జాగ్రత్తలను పశుసంవర్ధకశాఖ అధికారులు వివరించారు. బ్యాంక్, మెప్మా అధికారులు మాట్లాడుతూ కోళ్ల ఫారాల ఏర్పాటు, నిర్వహణ, ప్రభుత్వ సబ్సిడీలు, మార్కెటింగ్ సదుపాయాలు, పీఎంఈజీపీ, ఎన్ఎల్ఎం ప్రభుత్వ పథకాల గురించి తెలియజేశారు. ప్రభుత్వాలు కల్పించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయ అధికారి కె.మురళీకృష్ణ, మెప్మా సీఎంఎం అంకయ్య, డీఐసీ ఐపీఓ శ్రీనివాస్ స్పందన ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు మాణిక్యరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న జెనెక్స్ యాజమాన్యం

నెల్లూరు (టౌన్) : సీఎంఏలో చేరేందుకు నిర్వహించిన క్యాట్ ఫలితాల్లో జెనెక్స్ విజన్ అకాడమి విద్యార్థులు ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించారని సంస్థ డైరెక్టర్లు వెంగళరెడ్డి, కొండలరావు తెలిపారు. స్థానిక హరనాథపురంలోని జెనెక్స్ విజన్ అకాడమిలో ఆలిండియా స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలిండియా స్థాయిలో భరత్‌కుమార్ 183 మార్కులతో ప్రథమ ర్యాంకు సాధించారన్నారు. రోహిద 181 మార్కులతో మూడో ర్యాంకు, లహరి, అరవింద్ 179 మార్కులతో నాలుగో ర్యాంకు, గోవర్ధన్, అజయ్‌నిహార్‌లు 178 మార్కులతో ఐదో ర్యాంకు, గురుమహేష్ 177 మార్కులతో ఆరో ర్యాంకు, విష్ణుప్రియ 176 మార్కులతో ఏడో ర్యాంకు, లక్ష్మీఅలేఖ్య 174 మార్కులతో ఎనిమిదో ర్యాంకు, లాస్యప్రియ, యువరాజ్‌లు 173 మార్కులతో తొమ్మిదో ర్యాంకు సాధించారన్నారు. తమ విద్యార్థులు 95 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు.

జిల్లాస్థాయి అబాకస్ పోటీలు



నెల్లూరు (టౌన్) : స్థానిక హరనాథపురంలోని రత్నం అకాడమి ఆఫ్ చిల్డ్రన్ ఎడ్యుకేషన్ విద్యాలయంలో ఆదిత్యాస్ లెర్న్ టిక్ ఎడ్యు ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి అబాకస్ పోటీలను శనివారం నిర్వహించినట్లు అబాకస్ మేనేజర్ రాజ్‌కుమార్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులు ఈనెల 16న తిరుపతిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో రత్నం రేస్ స్కూల్ కరెస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపల్ జయకృష్ణ, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్స్ శ్రీదేవి, హరిప్రియ, అబాకస్ బిజినెస్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ దయాకర్ పాల్గొన్నారు.

సింహపురికి దత్త పీఠాధీశ్వరుల ఆగమనం





నెల్లూరు(బృందావనం) : మైసూరు అవధూత దత్త పీఠాధీశ్వరులు, జగద్గురువులు గణపతి సచ్చిదానంద, అవధూత దత్తపీఠ ఉత్తరాధిపతి దత్త విజయానంద తీర్థస్వామి శనివారం రాత్రి సింహపురికి ఆగమనం చేశారు. నగరంలోని శ్రీకృష్ణ యోగమందిరం, శ్రీఅష్టలక్ష్మి మందిరంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు జరుగనున్న పూజలు, అర్చనలు, హోమాలతో పాటు ప్రత్యేకంగా నిర్వహించనున్న 'కృష్ణామృత రాగ సాగర' ధ్యాన కచ్చేరి తదితర కార్యక్రమాల్లో వారు పాల్గొననున్నారు. కాగా భక్తులు విశేషంగా తరలివచ్చి వారికి స్వాగతం పలికారు.

94.13 శాతం పెన్షన్ల పంపిణీ



పింఛన్ ఇస్తున్న మంత్రి నారాయణ

• సర్వర్ సమస్యలతో పంపిణీ జాప్యం

నెల్లూరు (పొగతోట): సామాజిక పింఛన్లను 94.13 శాతం మందికి మాత్రమే పంపిణీ చేశారు. నగదు పంపిణీ ప్రారంభమైన కొద్ది సేపటికే సర్వర్ సమస్యలు తలెత్తాయి. దీంతో నగదు పంపిణీలో జాప్యం జరిగింది. అనేక ప్రాంతాల్లో లబ్ధిదారులు నగదు కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. జిల్లాలో 3,08,266 మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయాల్సి ఉండగా, 2,90,163 మంది లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. నగదు పంపిణీ ప్రక్రియలో మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

ఆరో డివిజన్‌లో..

నెల్లూరు(సెంట్రల్) : నగరంలోని ఆరో డివిజన్‌లో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ శనివారం సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమన్నారు. త్వరలో తల్లికి వందనం, ఉచిత బస్సు, రైతు భరోసాను అమలు చేస్తామన్నారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో తనుక ఎలాంటి విభేదాలు లేవన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలు

కార్పొరేట్‌కు దీటుగా మున్సిపల్ పాఠశాలలను అభివృద్ధి చేస్తామని మంత్రి నారాయణ అన్నారు. నెల్లూరులోని గుంటబడిని ఆయన శనివారం పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు.